



చెవిలో పువ్వుతో నిరసన ప్రదర్శన చేపడుతున్న నాయకులు

జగన్‌ను గెలిపించి తప్పు చేశాం..

- లెంపలేసుకుని అంగన్వాడీల నిరసన
- 39వ రోజూ సమ్మె
- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మద్దతు



అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించి తప్పు చేశామని లెంపలేసుకుని అంగన్వాడీలు నిరసన చేపట్టారు. శుక్రవారం 39వ రోజూ కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. సమ్మె శిబిరాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, చంద్రం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలందరినీ అక్కాచెల్లెళ్లుగా సంబోధిస్తూ అంగన్వాడీల పట్ల ఇంత క్రూరంగా వ్యవహరించడం తగదని మండిపడ్డారు. అంగన్వాడీలు అక్కాచెల్లెళ్లు కాదా..? అని ప్రశ్నించారు. అభయ హస్తం, అమ్మఒడి పేర్లతో రూ.వేల కోట్లు అక్కాచెల్లెమ్మలకు ఇస్తూ ఆదుకుంటున్నానని చెబుతున్న జగన్ రాష్ట్రంలోని 1.06 లక్షల మంది అంగన్వాడీలకు ఎంత వేతనం పెంచుతున్నారో చెప్పకపోవడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చాలని తెలిపారు. అంతకుముందు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఐఎఫ్‌టియు నాయకులు అరుణ్ కుమార్, మధు మాట్లాడారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని 39 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. అంగన్వాడీలను దుర్మార్గమైన చట్టాలతో బెదిరిస్తూ, అధికారులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. 24 గంటల దీక్షల్లో ఉలిందకొండ సెక్టార్ అంగన్వాడీలు నాగమణి, కవిత, దానమ్మ, ప్రియాంక, రాధ, చిట్టెమ్మ, మాదమ్మ, పద్మావతి, సువర్ణ, రాధిక, నిర్మల, బాయిసామ్మ, లక్ష్మీదేవమ్మ, ఆదిలక్ష్మి, జ్యోతమ్మ, వెంకటలక్ష్మి కూర్చున్నారు. సమ్మె శిబిరానికి ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్, రామాంజనేయులు, బతుకన్న, జిల్లా నాయకులు ఎం.గోపాల్, కె.సుధాకరప్ప, నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, ఎస్.మహ్మద్ రఫీ నాయకత్వం వహించారు. అంగన్వాడీలు చౌడేశ్వరి, విజయ, మంజుల, స్రవంతి, ఆనందమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.



లెంపలేసుకుని నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

- చెవిలో పూలతో యుటిఎఫ్ వినూత్న నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఉద్యోగ ఉపాధ్యాయులు సంబంధించిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ కర్నూలు డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం చెవిలో పూలతో ఉపాధ్యాయులు వినూత్న నిరసన ప్రదర్శన చేశారు. జిల్లా పరిషత్ నుంచి రాజ్‌విహార్ సెంటర్‌వకు ప్రదర్శన చేశారు. రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి. బి.నవీన్ పాటి, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి విధి విధానాలు నిర్ణయించకుండా ప్రభుత్వం మీనవేశాలు లెక్కిస్తోందని, వెంటనే విధి విధానాలు నిర్ణయించి, నివేదిక వచ్చేంతవరకు 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ ను వెంటనే చెల్లించాలన్నారు. ఏళ్ల తరబడి బకాయి ఉన్న సరెండర్ లీవులు, ఎన్ క్యాష్ మెంట్ బకాయిలు కూడా వెంటనే చెల్లించాలన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లు, పెన్షనర్ల ఫైనల్ పేమెంట్లు చెల్లించాలని, పిఎఫ్ సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలని, పిఎఫ్‌కు సంబంధించి చందాలు, వడ్డీలు, సకాలంలో చెల్లించేలా, పిఆర్‌సి డిఎ అరియర్స్‌ను జమ చేయాలని, అదే విధంగా సిపిఎస్‌కు సంబంధించి ఉద్యోగ ఉపాధ్యాయుల చందాలు, పిఆర్‌సి డిఎ అరియర్లు నగదు , సిపిఎస్ ఖాతాలలో జమ చేయాలని, ప్రభుత్వ షేర్ ను కూడా వారి వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలని యుటిఎఫ్ నాయకులు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యెహోషువ, రాష్ట్ర ,జిల్లా, మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అకాడమిక్‌పై దృష్టి సారిస్తాం

- వైస్ ఛాన్సిలర్ సుధీర్ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వర్సిటీలో అకాడమిక్ వ్యవహారాలపై దృష్టి సారిస్తామని వర్సిటీ వైస్ ఛాన్సిలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీ వైస్ ఛాన్సిలర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు రెక్టార్ సివి.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చా, సిబిసి డీన్ ఎన్‌టికె.నాయక్‌లు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్సిటీలో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



వైస్ ఛాన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుధీర్ ప్రేమ్ కుమార్

వేమన గొప్ప సంఘ సంస్కర్త

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సమాజాన్ని చైతన్య పరిచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో యోగి వేమన జయంతి సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలో ఉన్న దురాచారాలపై ఆనాడే తన పద్యాలతో ధైర్యంగా ఎదిరించారని తెలిపారు. కొన్ని మానవత్వంతో కూడిన రచనలు ఉన్నాయని, అటువంటి గొప్ప కవి అని కొనియాడారు. సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ సృజన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి నివేదించారు. విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ సృజన మాట్లాడుతూ... ఈనెల 22న ఫైనల్ రోల్ ప్రచురించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 27లోపు అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది వివరాలను డేటా బేస్‌లో నమోదు చేసేలా చూడాలని ఖజానా శాఖ డిడిని ఆదేశించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, ఖజానా శాఖ డిడి రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.



వేమనకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సృజన

పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు దుర్మార్గం

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఎర్రకత్వ గ్రామంలో దళిత రైతు ఎర్రమల, గోపి నాయక్, ధనరాజు నాయక్, కృష్ణ తదితరుల పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేయడం దుర్మార్గమని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ విమర్శించారు. పచ్చని పంట పొలాల్లో గ్రీన్‌కో కంపెనీ వారు విద్యుత్ స్తంభాలు వేసే ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రకత్వ గ్రామంలోని ఎర్రమల, కృష్ణ, బాలు నాయక్, గోపి నాయక్, ధనరాజ్ నాయక్ తదితర రైతుల పంట పొలాలను రామకృష్ణతో పాటు సమాచార హక్కు చట్టం నాయకులు జయన్న, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, బిఎంఎం నాయకులు జయన్న పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రీన్‌కో కంపెనీ వారు రైతుల అనుమతి లేకుండా అత్యంత తక్కువ నష్టపరిహారం చెల్లించి యథేచ్ఛగా విద్యుత్ స్తంభాలు వేయడానికి ఎవరు అనుమతిచ్చారని ప్రశ్నించారు. గ్రీన్ కో కంపెనీ ప్రయివేట్ కంపెనీ వారి లాభాల కోసం రైతుల పంట పొలాలను త్యాగం చేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దళితుడైన ఎర్రమల 8 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నారని, ఉల్లి, మొక్కజొన్న పంట వేశారని తెలిపారు. ఉల్లి పంట విత్తనం కోసం సాగు చేశారని చెప్పారు. ఒక ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారని తెలిపారు. ఇంకో రెండు నెలలు ఉంటే పంట చేతికి వస్తుందని, ఒక ఎకరా సుమారు 700 పళ్లాల దిగుబడి వస్తుందని చెప్పారు. ఒక పడి రూ.1000 నుంచి రూ.1200 పలుకుతుందని తెలిపారు. రైతుకు ఎంతో కొంత ఊరట ఇస్తుందనుకున్న సమయంలో గ్రీన్‌కో కంపెనీ వారు వచ్చి పంట పొలాలను నాశనం చేయడం క్షమించరాని విషయమని చెప్పారు. ఇప్పటికే అనేకమంది రైతుల పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేసి తీవ్ర నష్టం చేశారని తెలిపారు. రైతు అనుమతి ఇవ్వకపోయినా పోలీసులను స్తంభాలు వేస్తామని భయపెట్టడం సమంజసం కాదన్నారు. భయపెట్టే వైఖరిని మానుకోవాలని హితవు పలికారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేయడం వలన భూమి విలువ శాశ్వతంగా కోల్పోతుందని తెలిపారు. రైతుకు న్యాయమైన పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం, రైతుల ఉద్ధరణ కోసం ఉన్నామని చెబుతున్నాయని, మరో వైపు అన్యాయంగా, దౌర్జన్యంగా రైతుల భూములను ఏదో ఒక రూపంలో తీసుకొని నష్టం చేస్తున్నాయని విమర్శించారు. తక్షణమే రైతుల పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేయటం విరమించుకోవాలని, లేకపోతే ప్రజా సంఘాలు, రైతులు కూడగట్టి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.




విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

25న చంద్రబాబు పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-పత్తికొండ

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 25న పత్తికొండలో తలపెట్టిన రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ బిటి నాయుడు, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్తికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఇ.శ్యాం బాబు, మాజీ ఎమ్మెల్సీ కెఇ. ప్రభాకర్ లతో కలిసి కర్నూలు పార్లమెంట్ సెగ్మెంట్లోని నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కోట్ల సుజాతమ్మ, మీనాక్షి నాయుడు, టిజి. భరత్, బివి.జయనాగేశ్వర్ రెడ్డి, తిక్కారెడ్డిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. జగన్మోహన్ రెడ్డి మోసపూరితపు విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు తలపెట్టిన రా కదలిరా కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. టిడిపి మాజీ జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గుడిసె కృష్ణమ్మ, బత్తిన వెంకట రాముడు, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

నాడు నేడులో ఆగిన నిధులు కేటాయించాలి

ఎపిసికి ఎపి ఎంటిఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నాడునేడు కింద చేపట్టిన రెండో దశ పనుల నిధులను విడుదల చేయాలని కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిహెచ్ విజయజ్యోతికుమారికి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ముందుగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ .విజయ జ్యోతి కుమారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి క్యాలెండర్, స్టిక్కర్ ఆవిష్కరణ చేయించారు. కర్నూలు జిల్లాలో మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి రెండవ దశ నాడు నేడు పనులు జరుగుచున్న పాఠశాలలకు మిగిలిన నిధులు, అదనపు తరగతి గదులకు నిధులు ప్రభుత్వం నుండి మంజూరు చేయించాలని, రెండవ దశలో ఆగిన నిర్మాణం పనులకు, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు నిధుల కోసం కృషి చేయాలని కోరారు. చాలా పాఠశాలల్లో మూత్ర శాలలు, మరుగుదొడ్లు నాడు నేడు రెండవ దశ పనులలో పూర్తయినప్పటికీ డోర్స్ లేనందువలన వాటిని విద్యార్థులకు వినియోగించలేక పోయామని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె దృష్టికి తెచ్చారు. ఆమె సంబంధిత అధికారులను పిలిపించి వాటి గురించి విచారించారు. ఆమె స్పందిస్తూ తప్పనిసరిగా పాఠశాలలు సౌకర్యాల కల్పనకు, పాఠశాల నిర్వహణకు నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటరెడ్డి, కర్నూలు నగర శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.రాముడు, కార్యవర్గ సభ్యులు జి.మురళి, కె. రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-మద్దికేర

220 కెవి సబ్‌స్టేషన్, కార్బైడ్స్, కర్నూలు జిల్లా విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం06:00 గంటల నుండి సాయంత్రం 06:00 వరకు షెడ్యూల్ నిర్వహణ పని ఉందని మండల విద్యుత్ అధికారులు రఫీ ఖాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని, పారిశ్రామిక వినియోగదారులందరూ పైన పేర్కొన్న సమయాల్లో మాత్రమే 1 ఫేస్ సరఫరా లో తమ పరిశ్రమను నడపాలని అభ్యర్థించారు. వ్యవసాయ సేవలకు 3ఫేస్ సరఫరాఉండదని అన్నారు. నిర్వహణ పని పూర్తయిన తర్వాత మిగిలిన 3-దశల సరఫరా అందుతుందని,పారిశ్రామిక, వ్యవసాయ, సాధారణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆస్తి తగాధతో తల్లిని చంపిన కుమారుడు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం రాతన కొత్తూరు గ్రామంలో శుక్రవారం ఆస్తి తగాధతో కన్నతల్లినే కుమారుడు హత్య చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం... పి.లక్ష్మీదేవి ఆస్తి తగాదా విషయంతో పెద్దనాన్న లింగారెడ్డి సహకారంతో తన సొంత తల్లి లక్ష్మీదేవినే కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి హత్య చేశాడు. ఈ విషయంపై హత్యకు గురైన లక్ష్మీదేవి తల్లిదండ్రులు హనుమంతమ్మ ,రాఘవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లిఖిత్ కుమార్ రెడ్డి , లింగారెడ్డిలపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



హత్య కు గురయిన లక్ష్మీదేవి

ఉపాధికోసం 24న మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లాలో పేదల వలసలను అరికట్టి పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఈ నెల 24న మండల కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం కార్మికకర్షక భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం బి. వీరశేఖర అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్.దేశాయ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ మాట్లాడారు. జిల్లాలో తీవ్రమైన కరువు ఉన్నందున గ్రామీణ పేదలు సన్న చిన్న కారు రైతాంగం పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. వలసలు అరికట్టి ఆదుకుంటామనే భరోసాను అటు అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని విమర్శించారు. పేరుకు మాత్రం 22 మండలాలు కరువు మండలాలుగా ప్రకటిస్తున్నామని నెల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, నేటికీ ఒక్క కరువు సహాయక చర్య కూడా చేపట్టలేదన్నారు.ఉపాధి హామీ పనులు 150 రోజులు పెంచుతామని హామీ ఇచ్చారని, అది అమలు కాకపోగా ఇప్పటికే పని చేసిన కూలీలకు గత పది వారాలుగా రూ.20 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయంటే పేదలంటే ఈ ప్రభుత్వాలకు ఎలాంటి ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. కులం మతం పేరుతో రాజకీయాలు ప్రాంతాల పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేదవాడికి పట్టెడు అన్నం పెట్టేటటువంటి ఆలోచన ప్రభుత్వాలకు లేదని విమర్శించారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వ్యవసాయ కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం ఐక్యం చేసి ప్రభుత్వ యంత్రాంగాన్ని, నిలదీయాలని గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని, ప్రజా ప్రతినిధుల ఇళ్ల దగ్గర పనులైన పెట్టండి, తిండి అయినా పెట్టండి అంటూ పేదలు నిలదీయాలని వారన్నారు. ఉపాధి బకాయిలు చెల్లించి, వలసలు అరికట్టి ఉపాధి పనులు కల్పించాలని ఈనెల 24న మండల కార్యాలయాల ముందు ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. లింగన్న, ఇ. తిక్కన్న, బి.నాగన్న, కె. వెంకట రాముడు, బి.బాలకృష్ణ, వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

29 నుండి ఫిబ్రవరి 2 వరకు కుల గణన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఈనెల 29 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కర్నూలు నగరంలో కులగనన చేసేందుకు 11 మంది సూపర్ వైజర్లకు ఒక్కొక్కరికి ఇద్దరు అసిస్టెంట్లను నియమిస్తూ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల సహాయ సహకారాలతో అన్ని వార్డులలో పక్కాగా కులగణన చేయాలని ఆదేశించారు.

45 పాఠశాలల అప్ గ్రేడ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 45 ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలలో అప్‌గ్రేడ్ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈనెల 20న కర్నూల్ నగరంలోని ఎలుకూరు ఎస్టేట్లో ఉన్న నారాయణ పాఠశాలలో జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం సమావేశం నిర్వహిస్తున్నారని అన్నారు. ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారులు అలాంటి పాఠశాలలో వివరాలను ప్రధానోపాధ్యాయులకు పంపామన్నారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను తీసుకురావాలని పేర్కొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

జవహర్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డి వెల్లడించారు. ఈపరీక్ష ఉదయం 11-30 నుండి 1.30 వరకు జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు.. మొత్తం 3,693 మంది పరీక్ష కు దరఖాస్తు చేశారన్నారు.

ఒంటికాలిపై నిలబడి క్లాప్‌డ్రైవర్ల నిరసన

34వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఓల్డ్ సిటీ సిఐటియు నగర నాయకులు డి.కుమార్ అధ్యక్షత వహించారు. శుక్రవారం 34వ రోజు సమ్మెనుద్దేశించి సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ 34 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమన్నారు. 12నెలలజీతాలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, పని భద్రత, వీక్లీ ఆఫ్ లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లతో శాంతి యుతంగా సమ్మె చేస్తుంటే అధికారులు ప్రజాప్రతిని ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదన్నారు. కర్నూల్ నగరంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడాలనే అధికారాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే క్లాప్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి నగరాన్ని చెత్త మయంగా కాకుండా స్వచ్ఛ నగరంగా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలలో కార్మికులతో కలిసి మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సిఐటియు క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు రఘుశేఖర్, నరేష్ నవీన్, బాబ్జి, పరమేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు

నకిలీ సర్టిఫికెట్లను అరికట్టాలి: డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ లో ఎక్కువ పోస్టులు ఉన్నాయని అనేకమంది ఫేక్ సర్టిఫికెట్స్‌ను అక్రమంగా పొంది పరీక్షలకు హాజరయ్యారని, నకిలీ సర్టిఫికెట్లను అరికట్టాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సందర్భంగా గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రయ్యకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, నగర కార్యదర్శి హుస్సేన్‌బాష శుక్రవారం వినతి పత్రం అందజేశారు. చాలామంది ఉద్యోగాలు చేస్తున్న సమయంలోనే రెగ్యులర్ కోర్సులు చేసినట్టు సర్టిఫికెట్లు పొందారని, అలాగే ఒక్కరోజు కూడా కాలేజీకి వెళ్లకుండానే కృష్ణాజిల్లా, చిత్తూరు జిల్లా పుత్తూరు కేంద్రంగా అనేక ఫేక్ సర్టిఫికెట్స్‌ను అక్రమంగా ఆ కాలేజీలో పనిచేసే వారి ద్వారా రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టి కర్నూలు జిల్లాలోని వేలాదిమంది ఫేక్ సర్టిఫికెట్లు పొందినట్లు గతంలోనే అనేక సార్లు నిరుద్యోగులు ఆందోళనలు చేశారన్నారు. ఈ సారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సందర్భంగా వారు పొందిన సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్స్ ఆ సమయంలో వారి ఆధార్ ఆధారంగా వారు చదివారా లేక ఇతర ఉద్యోగాలు లేదా ఇతర కోర్సులు చేశారా అని పరిశీలించాలని జిల్లా శాఖ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అధికారి స్పందిస్తూ సీరియస్‌గా వెరిఫై చేస్తామని, ఫేక్ సర్టిఫికెట్లు పొందినట్లు అనుమానం వస్తే పరిశీలించి వెంటనే వారిపైన విచారించి తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలలో చేరితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి నుంచి టిడిపిలోకి భారీ చేరికలు

ప్రజాశక్తి-క్రిష్టగిరి

క్రిష్ణగిరి మండలం ఆగవేలి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పత్తికొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్తికొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కెఇ. శ్యాంబాబు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. వైసిపి పార్టీకి చెందిన 20 కుటుంబాలు ఆగవేలి గ్రామానికి చెందిన వైసిపి చెందిన ఉపసర్పంచ్ బోయ రామదాసు, రాముడు ఆధ్వర్యంలో బోయ ఆంజనేయులు, బోయ రామదాసు, శ్రీరాములు, రంగడు చెన్నకేశవులు, బోయశ్రీకళ, చిన్న లక్ష్మన్న, చిన్న మునిస్వామి, ఆంజనేయులు చెన్నకేశవులు, కౌలుట్లయ్య దాదాపు 20 కుటుంబాలు టిడిపిలో చేరారు.కెఇ శ్యాంబాబు వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తుగ్గలి : మండలం పరిధిలోనే రాంపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు శుక్రవారం టిడిపి ఇన్‌ఛార్జి కెఇ.శ్యాంబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు మండల పార్టీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు తెలిపారు. రాంపల్లి గ్రామానికి చెందిన మద్దికేర సూరన్న, ఊరు ఆవుల పెద్దయ్య, కురువ రంగన్న, కురువ మల్లికార్జున, మద్దికేర ఓబులేసు, మారికి కోదండ బావిగడ్డ పెద్ద ఓబులేసు, ఏకాశి ప్రసాద్, ముట్టి వెంకట్ రాముడు, మద్దికేర పరుశురాముడు, కిష్టయ్య, బుగ్గల బ్రహ్మయ్య, మహేష్ మద్దికేర సుఖాలు, మారికి పెద్దయ్య, చిట్యాల రంగన్న కుటుంబాలు తెలుగుదేశం పార్టీకి ఆకర్షితులై పార్టీ లో చేరారని తిరుపాల్ నాయుడు తెలిపారు.

అంబులెన్స్‌ల ప్రారంభం సంతోషకరం

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని ప్రజలకు సేవ చేసేందుకు మూడు అంబులెన్స్‌లను ప్రారంభించే భాగ్యం దక్కిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని తన స్వగృహం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డితో కలిసి అంబులెన్స్‌లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటాయని, ఎప్పుడు ఫోన్ చేసినా వెంటనే చేరుకుని సేవలు అందిస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంబులెన్స్‌ల డ్రైవర్లు పాల్గొన్నారు.

దేశంలో ఇన్స్యూరెన్స్ రంగంలో మార్కెట్ లీడర్ ఎల్ఐసి

- ఎల్ఐసి కడప డివిజన్ సేల్స్ మేనేజర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

దేశంలో ఇన్స్యూరెన్స్ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఎల్ఐసి నిలబడిందని ఎల్ఐసి కడప డివిజనల్ సేల్స్ మేనేజర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఐసి గత నెలలో తీసుకొచ్చిన జీవన్ ఉత్సవ్ పాలసీ రూ.కోట్ల వ్యాపారాన్ని చేజిక్కించుకుందన్నారు. జీవన్ ఉత్సవ పాలసీ పాలసీదారుడు తనకు అనువైన ప్రీమియం చెల్లింపు కాలాన్ని నిర్ణయించుకోవచ్చని తెలిపారు. మార్చి 31కి ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, ప్రతి ఏజెంటూ వ్యాపార అభివృద్ధిపై కేంద్రీకరణ చేయాలని కోరారు. బ్రాంచి మేనేజర్ సుజిత్ కుమార్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ఫైరోజ్, ఏజెంట్ల సంఘం లియాఫీ బ్రాండ్స్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాయకులు రంగస్వామి, రమేష్, ఖాజా హుస్సేన్, హరి పాల్గొన్నారు.

పకడ్బందీగా కుల గణన : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరిలో కుల గణన చేపడుతున్న అధికారులు

కుల గణనను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లకు ఎంపిడిఒ కొండయ్య, ఇఒఆర్‌డి బాలన్న సూచించారు. శుక్రవారం చిప్పగిరిలో పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న కుల గణనను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయం చేసుకొని కుల గణనను చేపట్టాలని తెలిపారు. ఇంటి యజమానితో తంబు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. ఈనెల 28 నాటికి పూర్తి చేయాలని హెచ్చరించారు. డిజిటల్ అసిస్టెంట్ పవన్ కుమార్, సర్వేయర్ రోజి పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని పంచాయతీల్లో చేపట్టిన కుల గణన సర్వేను ఎంపిడిఒ దశరథ రామయ్య పరిశీలించారు. మాచాపురం, పూలచింత, ఇబ్రహీంపురం, నది కైరవాడి సచివాలయాల్లో కులగణనను పరిశీలించారు.

'దళితవాడలో సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - ఆదోని



వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ఆదోనిలోని న్యూగాంధీ నగర్ దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జై భీం యూత్ నాయకులు భవాని శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా కాలనీకి వచ్చిన జయమనోజ్ రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు భవాని శంకర్ మాట్లాడారు. మరుగుదొడ్లు లేక మహిళలు ఆత్మాభిమానం చంపుకొని చెంబు పట్టుకుని బహిర్భూమికి ముళ్ల కంపల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్వాసనకు రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. పైపు లీకేజీ వల్ల తాగునీరు సరిగా అందడం లేదన్నారు. విద్యావంతులు ఎక్కువగా ఉన్న ఈ ఏరియాలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలపై జయమనోజ్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ... త్వరలోనే పనులు జరిగేలా అధికారులకు తెలియజేస్తామన్నారు.

అంగన్వాడీలను తొలగిస్తే.. పోరాటం ఉధృతం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు - 39వ రోజూ అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీ వర్కర్లను తొలగిస్తే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఎమ్మిగనూరు ప్రాజెక్టులో సమ్మె 39వ రోజుకు చేరింది. సమ్మె శిబిరం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, బి.రాముడు, ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, పద్మ, మండల ప్రాజెక్ట్ కార్యదర్శులు శైలజ, సిరజ, మేరీ, గ్రేష్మ మాట్లాడారు. అంగన్వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు పెంపుదలపై ఫేక్ వార్తలు వస్తున్నాయని గుర్తు చేశారు. వేతనాలు పెంచకపోగా నుంచి విధుల్లో చేరకపోతే అంగన్వాడీలను ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఏం తప్పు చేశారని అంగన్వాడీలను తొలగిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బెదిరింపులు మానుకొని, ముఖ్యమంత్రి ద్వారా వేతనాల పెంపును ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతవరకు సమ్మె విరమించేది లేదని, దానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇతర ప్రజా సంఘాలను, కలిసి వచ్చే రాజకీయ పార్టీలను కలుపుకొని సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గాయత్రి, భాగ్యమ్మ, శిరోమణి, పుష్పవతి, నాగలక్ష్మి, శారద, వరలక్ష్మి, నాగేశ్వరమ్మ, తులసి, కృష్ణవేణి, బండ లత, ప్రమీల, నిర్మల పాల్గొన్నారు. **ఆదోని**లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వినతిపత్రం అందజేశారు. నాయకులు వరలక్ష్మి, సరోజ, జానకి అధ్యక్షత వహించారు. నిరవధిక నిరాహార దీక్షల్లో భాగంగా 3వ రోజు ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, అధ్యక్షులు రామాంజనేయులు, వీరారెడ్డి, ఎఐటియుసి నాయకులు వీరేష్, విజయ్ మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, మీనా కుమారి, రిజ్వానా, గీత, విమల, కరుణ, పద్మ, సోమక్క, లలిత, ఉమా, లక్ష్మీదేవి, సుజాత, సుగుణమ్మ, శాంతమ్మ, రమణమ్మ, రంగమ్మ, సువార్త, ఆంథోనమ్మ, రేణుక, శారద, గౌసియా, గీతా, ఈరమ్మ పాల్గొన్నారు. **ఆస్పరి**లో అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజినేయులు, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు రెడ్డి, రంగస్వామి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, ప్రమీల, పద్మ, శ్రీదేవి, అంగన్వాడీలు విశ్వకుమారి, బేగం, లత, దస్తగిరమ్మ, రాణి, ప్రమీల పాల్గొన్నారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి షాకీర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ మాట్లాడారు. సిపిఎం నాయకులు కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 39వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలాక్షి, భీమేశ్వరి, లావణ్య పాల్గొన్నారు.



ఆదోనిలో...

కౌతాళంలో 39వ రోజూ నిరవధిక దీక్షలు చేపట్టారు. 'జగనన్నకు కోటి సంతకాల సేకరణ' చేపట్టారు. రెండు గంటల వ్యవధిలో దాదాపు 852 మంది అంగన్వాడీలకు మద్దతుగా సంతకాలు చేశారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, ప్రాజెక్టు ఉపాధ్యక్షులు విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



ఆస్పరిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు



ఆలూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గుడికి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం ఆదోనిలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీకి చెందిన ఆదిలక్ష్మి చిన్న మార్కెట్‌లో ఉన్న శ్రీమహాయోగి లక్ష్మమ్మ దేవాలయానికి దర్శనం కోసం బయల్దేరారు. ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బండిపై వెంబడించారు. మెడలో బంగారు గొలుసును లాగేసి ద్విచక్ర వాహనంపై పరారయ్యారని బాధితురాలు తెలిపారు.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం తగదు : సిపిఎం, రైతుసంఘం

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని అగ్రహారం గ్రామంలో రేషన్ పంపిణీని సక్రమంగా చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి ఈరన్న డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలోని కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయలేదని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తహశీల్దార్ రామాంజినేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అగ్రహారం గ్రామంలో 19 రోజులైనా రేషన్ బియ్యం అందరికీ అందలేదన్నారు. గ్రామంలో మొత్తం 275 రేషన్ కార్డుదారులకు గాను కేవలం 110 మందికి బియ్యం ఒక్కటే పంపిణీ చేశారని తెలిపారు. కందిపప్పు, పంచదార, ఇతర వస్తువులు ఏవీ ఇవ్వలేదన్నారు. మిగిలిన 165 మంది కార్డుదారులకు రేషన్ బియ్యం కూడా వేయలేదని తెలిపారు. రేషన్‌పైనే ఆధారపడి ఉన్న నిరుపేదలకు సంక్రాంతి పండగకు కూడా అందలేదన్నారు. ప్రజా పంపిణీపై నిర్లక్ష్యం వహించిన పంపిణీదారుల పై, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే రేషన్ పంపిణీ చేయాలని, బియ్యంతో పాటు ఇతర వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. లేకపోతే గ్రామస్తులందరితో కలిసి రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్, సిఐటియు నాయకులు శేఖర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రానుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిసిసి అధ్యక్షులుగా వైఎస్.షర్మిలను నియమించడం, ఎఐసిసి కార్యవర్గ సభ్యులుగా గిడుగు రుద్రరాజును ఎన్నుకోవడం హర్షించదగ్గ పరిణామమని తెలిపారు. షర్మిల రాకతో ప్రత్యర్థుల గుండెల్లో వణుకు మొదలైందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదోని నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం తథ్యమన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు రైతులు, విద్యార్థుల సమస్యలు, గుంతలమయమైన రోడ్లు, రైతు వలసలు నివారించాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ తరఫున వైఎస్.షర్మిలకు, గిడుగు రుద్రరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని అలారుదిన్నె, కుంకనూరు, పొట్లపాడు, కొత్తపేట, పుల్లాపురం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను దేవనకొండ సిఐ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ బూత్‌లలో సౌకర్యాల గురించి సంబంధిత రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించి చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి :ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప, జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు ప్రాంతీయ కార్యాలయం నుంచి ప్రభుత్వాస్పత్రి, ట్యాంక్ బండ్ రోడ్డు, శకుంతల సర్కిల్, బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించి, సోమప్ప సర్కిల్‌లో మూతికి నల్లరిబ్బన్ ధరించి మోకాళ్లపై నిలబడి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిఎ అరియర్స్, పిఎఫ్ లోన్లు, ఎపిజిఎల్ఐ లోన్, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సకాలంలో చెల్లించకుండా ఆర్థిక నష్టం కలిగిస్తోందని విమర్శించారు. పిల్లల చదువుల కోసం, వివాహాల కోసం వచ్చే జీవితంలో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకుంటే ఆ మొత్తం సకాలంలో చేతికందక పిల్లల చదువులు, వివాహాలు మధ్యలో ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మహిళా నాయకులు బి.ఉమా, వరలక్ష్మి, అరవిందమ్మ, నాగజ్యోతి, పద్మావతి, అరుణ, సువర్ణ, చంద్రకళ, జిల్లా ఆడిట్ సభ్యులు డి.కౌలన్న, మల్లారి నాగరాజు, ఎం.రాజు, చంద్రపాల్, అబ్దుల్ లతీఫ్, గురుస్వామి, ప్రసాద్, నీలి నాగరాజు, వీరభద్రయ్య, పాపయ్య, శివకుమార్, రవికుమార్, భీమేష్, బాబు, పెద్దారెడ్డి, బిజి.మాదన్న, ఎం.సుధాకర్, ఆంజనేయులు, తాయప్ప, బాలరాజు, శ్రీనివాసులు, నారాయణ, విజయ్ కుమార్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, మున్సిపల్ పాఠశాల ముందు నిరసన చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, రుద్రముని, ఎల్‌కె.బసప్ప, నర్సయ్య గౌడ్, కృష్ణుడు, నాయకులు మల్లికార్జున, ఆవుల బసప్ప, నాగేష్, రంగస్వామి, నరసయ్య, రామన్న, మహిళ నాయకులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



నల్ల రిబ్బన్ ధరించి మోకాళ్లపై నిల్చోని నిరసన తెలియజేసిన నాయకులు



మాట్లాడుతున్న పీఠాధిపతులు

శ్రీరాముని శోభాయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - మంత్రాలయం

అయోధ్యలో పట్టణంలో శ్రీరామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్టాపన శుభ సందర్భంగా నిర్వహించే శ్రీరాముని శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు కోరారు. శుక్రవారం స్థానిక శ్రీమఠం ఆవరణంలోని గురు రాజాంగణ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరంలో జరిగే కార్యక్రమంలో భాగంగా స్థానికంగా కూడా శ్రీమఠం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీమఠం నుంచి పాత ఊరు, సుజయీంద్ర నగర్, రామచంద్ర నగర్, రాఘవేంద్ర నగర్ కాలనీల్లో శోభాయాత్ర జరుగుతుందని చెప్పారు. మాధవరం రోడ్డులో ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి 48 అడుగుల శిలా విగ్రహం ఎదుట 36 అడుగుల శ్రీఅభయ రామ శిలా విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. శుక్రవారం ఆదోని రైళ్ల తనిఖీ చేస్తుండగా ఆదోనికి చెందిన బోయ ఉదయ్ కుమార్‌తోపాటు మరో ముగ్గురు రైలు దిగి వెళుతుండగా దాడులు చేసి అదుపులో తీసుకొని 16 బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రైళ్లలో ప్రయాణించే వారి లగేజీలను పరిశీలిస్తున్నామన్నారు. మద్యం, నిషేధిత వస్తువులు అక్రమంగా తరలించినా, అలాంటి వారికి సహకరించినా, చట్టరీత్యా రైల్వే ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్నా వారి పట్ల కూడా నిఘా ఉంచుతామన్నారు. హెచ్‌సి సాయి, సిబ్బంది గాదిలింగ, హుస్సేని, పెద్దయ్య పాల్గొన్నారు.

వలసలను నివారించండి...

- గ్రామాలు ఖాళీ అవుతున్నా పట్టించుకోరా..?

-వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి పనులు చేపట్టి వలసలను నివారించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న డిమాండ్ చేశారు. 'ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించి వలసలు నివారిస్తాం. ఎవరూ వలసలు వెళ్లొద్ద'ని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కడ దాక్కున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. శుక్రవారం మండలంలోని మదిరె గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. గ్రామంలో పని ప్రారంభించి 11 వారాలైనా ఉపాధి హామీ వేతనాలు నేటికీ చెల్లించలేదని, ఎలా బతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో చేసేందుకు పనుల్లేక నవంబర్ నుంచే హైదరాబాద్, గుంటూరు, బెంగళూరు, తదితర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని చెప్పారు. 'వలసలు వెళ్లొద్దు. మేము ఉపాధి కల్పిస్తామ'ని అధికారులు హామీ ఇచ్చారని, కానీ ఎక్కడా వలసలు ఆగే పరిస్థితి లేదని తెలిపారు. రెండ్రోజులుగా గణేకల్, పాండవగల్ గ్రామాల నుంచి దాదాపు 10 వాహనాల్లో 200 కుటుంబాలు వలసబాట పడితే ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి కూడా మాట్లాడే పరిస్థితి లేదని విమర్శించారు. ఉపాధి చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందని, 2024 ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపాలని కోరారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని, కరువు పరిస్థితుల నేపథ్యంలో అదనంగా 100 రోజులు పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. వలసలు ఆగాలంటే ఈ ప్రాంతంలో సాగునీరు, ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజులు పని కల్పించాలని తెలిపారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

మహిళల రక్షణలో వైసిపి విఫలం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. మంత్రి గుమ్మనూరు జయరామ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలూరు నియోజకవర్గానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై వైసిపికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడని, చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, ప్రభుత్వం వైసిపి కార్యకర్త కావడంతో బాధితులనే వేధిస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో పేరుకు మాత్రమే రాష్ట్ర హోం మంత్రులు మహిళలు ఉన్నారని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి దిశా చట్టం ప్రవేశపెట్టినా, దిశా పోలీసులను ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేసినా ప్రయోజనం ఏమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారులు ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి జైలుకు తరలించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు మురళీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ఆదోనిలో టిడిపి జెండా ఎగురవేస్తాం : టిడిపి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాబోయే ఎన్నికల్లో ఆదోనిలో టిడిపి జెండాను ఎగురవేస్తామని టిడిపి యువ నాయకులు మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉండవల్లిలో నారా లోకేష్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్రంలో పాదయాత్రను దిగ్విజయంగా ముగించుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపామన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా టిడిపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందుకు యువత అహర్నిశలు కష్టపడి, టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆదిశగా యువత ముందుండాలని నారా లోకేష్ కోరారన్నారు. వినయ్, జెపి.వెంకటేష్, లోకేష్, సురేష్ నాయుడు, భరత్ కుమార్ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేత

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు శివరాములు, శ్రీనివాసులు మాట్లాడారు. 42 పాఠశాలలకు 3,398 ట్యాబ్‌లు వచ్చాయన్నారు. వీటిని విద్యార్థులకు సకాలంలో పంపిణీ చేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నబీ, చంద్రశేఖర్, ఎంఆర్‌సిలు నాగవేణి, మల్లికార్జున, హుస్సేనప్ప, బీచుపల్లి పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాలను ఎడిఎ సీడ్ ఫార్మ్ శైల కుమారి, ఎఒ షర్మిల, ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ఎమ్‌డి.ఖాద్రీ, ఎఒ జి.హేమలత శుక్రవారం పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల అమ్మకాలు సిఎంఎఐడి, డిబిటి, ఎరువుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ... మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమకు అవసరమైన ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

దళితుల శ్మశానానికి హద్దులు చూపండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో దళితుల శ్మశాన స్థలానికి హద్దులు చూపించాలని కెవిపిఎస్ గ్రామ నాయకులు కోరారు. శుక్రవారం వారు శ్మశాన స్థలాన్ని పరిశీలించి, మాట్లాడారు. శ్మశాన స్థలానికి హద్దులు చూపించాలని గతంలో ఎన్నోసార్లు అధికారులను కోరినట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. తహశీల్దార్ శ్మశాన స్థలం సమస్యను పరిష్కరించాలని కోరారు. కెవిపిఎస్ గ్రామ నాయకులు తిక్కప్ప, పరమేష్, ఈరన్న, మధు, శివయ్య, మత్తయ్య పాల్గొన్నారు.

కర్నూలు ఎంపీ టిక్కెట్ రాంపుల్లయ్య యాదవ్‌కు కేటాయించాలి

- యాదవ చైతన్య సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస యాదవ్

ప్రజాశక్తి-ఆలూరు

టిడిపి కర్నూలు ఎంపీ టిక్కెట్ టిడిపి సీనియర్ నాయకులు రాంపుల్లయ్య యాదవ్‌కు కేటాయించాలని జిల్లా యాదవ చైతన్య వేదిక అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వెంకట రాముడు కోరారు. శుక్రవారం వారు ఆలూరులో విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ఒక్క టిక్కెట్ కూడా యాదవులకు కేటాయించలేదని, టిడిపి అయినా కర్నూలు ఎంపీ టికెట్ రాంపుల్లయ్య యాదవ్‌కు కేటాయించాలని కోరారు. రాంపులయ్య యాదవ్ సీనియర్ రాజకీయ నాయకులని, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పట్టు ఉన్న నాయకులని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు ఎంపీ టిక్కెట్ యాదవులకు కేటాయించాలని కోరారు. ప్రచార కార్యదర్శి మల్లికార్జున యాదవ్, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, బాషా, అక్బర్ పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు

- సర్పంచి సావిత్రి, ఎంపిడిఒ కొండయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో గ్రామాల్లో ఉన్న నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతోందని బెల్డోన సర్పంచి కరివేముల సావిత్రి, ఎంపిడిఒ సివి.కొండయ్య, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అఫ్రోజ్ జహాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బెల్డోన గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడతను సర్పంచి సావిత్రి, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అఫ్రోజ్ జహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు నుంచి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్లు వెంకటేష్ నాయక్, జయలక్ష్మి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలు వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారని సర్పంచి సావిత్రి తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాల వల్ల దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న నిరుపేదలకు వైద్య పరీక్షలతోపాటు మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. వైసిపి నాయకులు కరివేముల గోవిందు, పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, రామాంజనేయులు, విఆర్‌ఒ పెద్దన్న, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **గోనెగండ్ల** సచివాలయం-2 పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి జిల్లా మలేరియా నివారణాధికారి ఎ.నూకరాజు హాజరై పరిశీలించి, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యులు మనోజ్ కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, పిహెచ్‌సి సిబ్బంది హనుమంతు, పరమేష్, ఇఒఆర్‌డి నగేష్, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

వరుణ్ తేజ్ అత్యున్నత స్థాయికి ఎదగాలి

- సినీ హీరో వరుణ్ తేజ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

సినీ హీరో వరుణ్ తేజ్ అత్యున్నత స్థాయికి ఎదగాలని పవన్ కల్యాణ్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీచల్లా వరుణ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో తేరు బజారులో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీచల్లా వరుణ్ హాజరయి కేక్ కటింగ్ చేశారు. మున్నా, నవీన్, రవి, వలీ, రమేష్, శ్రీను, ఉదయ్, మహబూబ్ పాల్గొన్నారు.

నాగలదిన్నె బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె గ్రామంలోని బ్రిడ్జి వద్ద ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మయ్య వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నామని, పోలీసులకు వాహనదారులు సహకరించాలని తెలిపారు. వాహనాల్లో మత్తు పదార్థాలను తరలించరాదని, అలా తరలిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన పత్రాలను వాహనదారులు తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు. మత్తు పదార్థాలు తరలిస్తున్నట్లు ఎవరికైనా సమాచారం అందితే పోలీసులకు తెలపాని కోరారు. అనంతరం బ్రిడ్జి దగ్గర ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టును పరిశీలించారు.





సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన, జిల్లా కలెక్టర్ తదితరులు

రాజ్యాంగ హక్కులను కాపాడండి

అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేస్తూ అంగన్‌వాడీల నిరసన



నంద్యాల కలెక్టరేట్: మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయవాడలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు ఆయన రచించిన రాజ్యాంగంలోని హక్కులను కాపాడి అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసు రత్నం, నాగరాజు, పట్టణ కార్యదర్శి కెఎండి గౌస్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం నిర్మలమ్మ అన్నారు. అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 39వ రోజుకు చేరింది. శుక్రవారం నంద్యాల పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి విగ్రహ ఆవిష్కరించడంతో పాటు అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. 39 రోజులుగా రోడ్లపై కూర్చొని అంగన్వాడీలు నిరసన తెలుపుతున్న సీఎం స్పందించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు రూ.26 వేల వేతనం, గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనిరాహార దీక్షలను సిఐటియు సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు మద్దులు, పట్టణ కార్యదర్శి కెఎండి గౌస్‌లు ప్రారంభించారు. 20 మంది నంద్యాల రూరల్ ప్రాజెక్టు నుండి 24 గంటల నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి నంద్యాల అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు కార్యదర్శి సునీత, అంగన్వాడీ టీచర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, నాయకులు నరసింహ నాయక్, సుధాకర్, మారెన్న, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి వెంకటలక్ష్మిలు అన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని 39వ రోజు నిరవధిక సమ్మె చేపట్టి అంబేద్కర్ విగ్రహంకు వినతి పత్రం అందజేస్తూ నిరసన తెలిపారు. హెల్పర్స్ యూని యన్ నాయకురాలు లక్ష్మీదేవి, సుజాత, లక్ష్మి, రవణమ్మ, సిఐటియు నాయ కులు గణపతి, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల:** తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేసి నివాళులర్పించారు.



మహానంది : అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న అంగన్వాడీలు

జగన్ ప్రభుత్వానికి అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని జ్ఞానోదయం కలిగించాలని అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు నిరసనలు దీక్షలను ఆపేదే లేదన్నారు. **కొత్తపల్లి:** తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని 39వ రోజు నిరవధిక సమ్మె చేపట్టి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ హరిత, కొత్తపల్లి మండల నాయకురాలు నాగమణి, శ్రీదేవి, రమణమ్మలు మాట్లాడారు. **బండి ఆత్మకూర్** మండల కేంద్రంలో ఎస్ఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దీక్షలో అంగన్వాడీ యూనియన్, హెల్పర్స్ నాయకులు వెంకటరమణమ్మ, వసంత ఆనందమ్మ, శ్యామల మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటి మండల కమిటీ కార్యదర్శి రత్నమయ్య, రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. **మిగతా 6వ పేజీలో...**

వారసత్వ బంగ్లాకు కొత్త శోభ

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో పునరుద్ధరించిన వారసత్వ సబ్ కలెక్టర్ కార్యాలయ భవన పునర్ నిర్మాణంతో కొత్త శోభ వచ్చిందని, అభివృద్ధి లేదని విషప్రచారం చేసే ప్రతి పక్షాలకి సమాధానమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంను మంత్రి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ1896లో కట్టిన సబ్ కలెక్టర్ భవనం, ఆ తర్వాత స్వాతంత్ర్యానికి పూర్వం 1915లో బ్రిటీష్ హయాంలో మరమ్మతుల పనులు చేశారన్నారు. ఆ తర్వాత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అసాంఘీక కార్యకలాపాలకు, కంపచెట్లకు, కుక్కలు, పందులకు ఆవాసంగా పూర్తిగా కూలిపోయే స్థితికి భవనం చేరిన సంగతి నంద్యాల ప్రజలకు తెలుసన్నారు. ఇన్నేళ్ల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సబ్ కలెక్టర్ కార్యాలయ భవనాన్ని పునర్నిర్మాణం చేసిందన్నారు. కేవలం రూ.కోటితో 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్ అండ్ బీ శాఖ అద్భుతంగా నిర్మించిందన్నారు. భవనం చుట్టూ 5 ఎకరాల స్థలానికి సంబంధించి ల్యాండ్ స్కేపింగ్ ద్వారా తోటలా మార్చనున్నట్లు మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. జిల్లా ఏర్పాటైన వెంటనే అనేక ఇబ్బందుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ నేతృత్వంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తూ పరిపాలన అందించడాన్ని మంత్రి బుగ్గన అభినందించారు. అందులో భాగంగా భవన నిర్మాణాలు చేపట్టి సహకరించిన జిల్లా యంత్రాంగం సహా ఆర్ అండ్ బీ శాఖ కృషిని మెచ్చుకున్నారు. నాలుగేళ్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి వెల్లడించారు. రూ.500 కోట్లతో నంద్యాలలో మెడికల్ కాలేజీని ఏర్పాటు, నంద్యాల నుంచి కొల్హాపూర్, ఆత్మకూరు మీదుగా హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి, నంద్యాల నుంచి వైఎస్ఆర్ జిల్లాలోని జమ్ముల మడుగుకు నేషనల్ హైవే, డోన్ నియోజకవర్గంలో జాతీయ రహదారి వంటి వేలకోట్ల ప్రాజెక్టుల పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. ఇంకా అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. రోడ్లు భవనాల శాఖలో భవనాలను చంద్రబాబు సమాధి చేశారన్నారు. ఈ కార్యక్ర మంలో నంద్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల ఎంఎల్సీ ఇసాక్ బాష, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబీబుల్లా, జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవో శ్రీనివాస్, ఆర్ అండ్ బీ జిల్లా ఇంజినీర్ ఏ.వి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి : యుటిఎఫ్



నంద్యాలలో నిరసన చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల: పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఏపిజీఎల్ఐ, సరెండర్ లీవ్, కరువు భత్యం, పీఆర్సీ, మెడికల్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని, ఒపిఎస్ అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యకుడు ఎస్. జాకీర్ హుస్సన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం సత్య ప్రకాష్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఏకె సుజాతా, వివి రామ్ మోహన్, జిల్లా కార్యదర్శులు టి అరవింద్ కుమార్, పి సంధ్యా రాణీ డిమాండ్ చేశారు. యు టి ఎఫ్ రాష్ట కమిటీ పిలుపు మేరకు నంద్యాల శ్రీనివాస సెంటర్ నుండి ఎంఆర్ఓ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ మహిళా నాయకులు నాగ లక్ష్మి యు టి ఎఫ్ నాయకులు పి గోపల్ వై వెంకట రమణ, మొహమ్మద్ కాసిం,జూన్సన్ ,ఎం శివ శంకర్,రామ్ నాయక్,ఎం వెంకటేశ్వర్లు,ఇ శేఖర్ ఎం శేకర్,బి పి.వెంకటేశ్వర రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డోన్ పట్టణంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. గాంధీ సర్కిల్ దగ్గర నల్ల రిబ్బన్‌లతో, జన్మభూమి కట్టి దగ్గర చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, సహాధ్యక్షులు రామమూర్తి మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు మాట్లాడుతూ పిఆర్సి విషయంలో కాలయాపన తగదన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు అంగన్వాడి వారు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోపాల్, మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, బొజ్జన్న, కేశవరెడ్డి, సహాధ్యక్షురాలు శంషాద్ బేగం, రహీం, ప్రసాద్, లక్ష్మి దేవి,రమేష్ నాయుడు, కలాం, భాస్కర్ రెడ్డి, క్రిష్ణ నాయక్, అల్లిపీరా, చంద్రమోహన్, రియాజ్, నాగలక్మయ్య, అంజనప్ప, సుదర్శన్, రమేష్,బాలరంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పి.ఎఫ్,ఏపిజీఎల్ఐ,సరెండర్ లీవ్,కరువు భత్యం,పీఆర్సీ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జె. సుధాకర్ డిమాండ్ చేశారు. **మిగతా 6వ పేజీలో...**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

ఓటర్ల తుది జాబితా ప్రచురణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సవరణ తుది జాబితా సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్, రాష్ట్ర చీఫ్ ఎలెక్ట్రోరల్ అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు నివేదించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫారమ్‌లు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగిం పులు, సవరణలు, పోలింగ్ అధికారుల నియామకం, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్ట్ లు, పీఎస్ఈలు, డీఎస్ఈలు, ఈవీఎంల భద్రతా గదులు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాని ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా **మిగతా 6వ పేజీలో...**

ప్రజా సమస్యలపై 26న ట్రాక్టర్ ర్యాలీ

- ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - నంద్యాల



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ మేరకు కార్మిక, రైతు, కౌలు రైతుల తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీన నంద్యాల జిల్లా సెంటర్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నాడు నంద్యాలలో టీ. నరసింహయ్య భవన్లో జరిగిన కార్మిక ,రైతు, కౌలు రైతు సంఘాల నాయకత్వన వి. యేసు రత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్, సిఐటియు, జిల్లా కార్యదర్శి ఏ నాగరాజు, కాంగ్రెస్ కిసాన్ నాయకులు ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మార్కు, రైతు కూలీ సంఘం నాయకులు రంగనాయకులు మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలకై పార్లమెంట్‌లో చట్టం చేస్తానని, విద్యుత్ సంస్కరణ నుంచి వ్యవసాయ రంగాన్ని మినహాయిస్తానని, ఢిల్లీ ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకుంటానని, అక్రమ కేసులు ఎత్తివేస్తానని, నాలుగు లేబర్ కోడ్లు ఎత్తివేస్తానని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు అమలుచేయాలనీ, రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని, తదితర డిమాండ్ల సాధనకై రైతు, కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ట్రాక్టర్లు, ఇతరవాహనాలతో నంద్యాల జిల్లా సెంటర్లో ర్యాలీ చేసి నిరసన తెలియజేయాలని కోరారు. వ్యవసాయ కూలీలకు రోజు వేతనం 600లరూపాయలు ఇవ్వాలని, 200 రోజులు పని దినాలను కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపచేయాలని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేస్తున్న న్యాయమైన సమ్మెను విరమిపం చేసి, వాళ్ళ డిమాండ్లు అంగీకరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. వెంకటేశ్వర్రావు, ఏ. సురేష్, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



కమిషనర్ శ్రీనివాస్ రావు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు

స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాల ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, నాయకులు మారెన్న, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ప్రసాద్, పెద్ద నాగరాజు, తిమ్మయ్యలు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాల యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వారి సమస్యలపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల కార్మికులకు జీవో ప్రకారంగా రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించాలని అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని వాటర్ సప్లై, వీధిదీపాలు, టౌన్ ప్లానింగ్, డ్రైవర్లు, మెకానికులు, వెల్డర్, ట్విట్టర్లు, వెటర్నరీ సూపర్వైజర్లు తదితర విభాగాలకు చెందిన కార్మికులు నైపుణ్యంతో కూడిన విధులు నిర్వహిస్తున్నారు. కానీ పనికి తగిన జీతం చెల్లించకుండా దీర్ఘకాలంగా అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అశోక్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం

- పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - రుద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు విలేజ్ క్లినిక్స్, జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు, ఆరోగ్య శ్రీ వంటి వివిధ పథకాల ద్వారా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తోందని ఎంపి పోచ బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర జన వనరుల సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో రూ. 1,85 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని వారు ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమ కోసం ఇచ్చిన వాగ్దానాలన్నిటిని నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి, జడ్పిటిసి మాధవి, ఎంపీపీ బాలస్వామి, మండల సచివాలయాలలో కన్వీనర్ పాణ్యం నాగేష్, జిల్లా ఆరోగ్యశాఖ ఏవో డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ అమరనాథరెడ్డి, డాక్టర్ గాయత్రి, పలువురు వైసిపి నాయకులు హెల్త్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర జన వనరుల సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డితదితరులు

ముస్లిం మైనారిటీల పక్షపాతి సిఎం జగన్ : ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

ముస్లిం మైనారిటీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కొండపేట మర్కజ్ మజీద్ వద్ద తబ్లిక్ జమాత్ ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మర్కజ్ మస్జిద్‌కు పార్కింగ్ కొరకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని, ఎంపీడీవో శివరామయ్యను, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్‌లను ముస్లిం సోదరులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ముస్లింలకు సైతం పెద్దల సభలో చైర్మన్‌గా ముస్లిం మహిళను ఎన్నిక చేయడం జరిగిందని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతోనే బనగానపల్లె నియోజకవర్గం లో కూడా అన్ని వర్గాల ప్రజలతో పాటు ముస్లింలకు పెద్దపీట వేసి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరిగిందని తెలిపారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని, ఎమ్మెల్యేగా తనను మరో మరో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, వైసిపి నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, పెద్దన్న, ఎంపిటీసీ తాహెర్, తబ్లిక్ జమాత్ అమీర్ మహమ్మద్ ఖాసిం, మర్కజ్ మజీద్ ప్రెసిడెంట్ జావేద్ బిన్ అబ్దుల్లా, ఎస్ఆర్బిసి విశ్రాంత ఉద్యోగి సయ్యద్ భాయ్ ,ఎస్ఆర్బిసి మదర్సా మౌలానా షాదుల్లా, మర్కజ్ మసీద్ పేషిమాం జావేద్ హుస్సేన్, మక్కా మజీద్ పేషిమాం ,సునార్ ఇక్బాల్, మాలి, హసన్, గౌండ మాభాష, గౌండవలి, ఖాజాపీర్, ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

ప్రభుత్వానికి రైతన్నల ఆక్రందన పట్టదు

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసీపీ ప్రభుత్వానికి అక్రమ కేసులు తప్ప రైతన్నల పట్టవని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని చిన్నరాజు పాలెం, యాగంటి పల్లె గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలకు వచ్చిన బీసీ జనార్దన్ రెడ్డికి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి బాబు భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను, గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి, టిడిపి ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్ బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, టీడీపీ నాయకులు చిన్నరాజుపాలెం నరసింహులు, రామాంజినేయులు, చంద్రమోహన్, యాగంటి పల్లె తపాల పెద్ద దస్తగిరి, శివ శంకర్ రెడ్డి, మల్లేష్ రెడ్డి, మీరాపురం నారాయణరెడ్డి, పాత పాడు శంకేశ్వర రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21న బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నంద్యాలకు రాక

ప్రజాశక్తి - నంద్యాల రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న అభిరుచి మధు

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఈనెల 21వ తేదీన పార్టీ బూతు కన్వీనర్ శక్తి కేంద్రాల ఆధ్వర్యంలో నంద్యాలకు రానున్నారని శుక్రవారం నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభి రుచి మధు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసి వాల్ లైటింగ్ మొదలయ్యి ఇందులోనే కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడం జరుగుతు దన్నారు. అనంతరం సౌజన్య ఫంక్షన్ హాల్ నందు కార్యకర్తలు, నియోజకవర్గాల అసెంబ్లీ కన్వీనర్లు తదితరులతో సమావేశం ఉంటుందన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి -కొలిమిగుండ్ల : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గ్రామాలలో ఉన్న నిరుపేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని కొలిమిగుండ్ల వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి తెలిపారు. మండలం పరిధిలోని చింతలయపల్లె పరిధిలోని ప్రజలకు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైస్సార్సీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబటి గురివిరెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు దృష్టిలో ఉంచుకొని సీఎం జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పెట్టారన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపులో డాక్టర వినోద్ కుమార్ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి అంబటి చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జయ రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు, పంచాయతీ సెక్రెటరీ భార్గవ లత,మెడికల్ ఆఫీసర్ వినోద్ కుమార్,పిల్లల డాక్టర్ కళ్యాణ్,జయరాం జనరల్ సర్జన్,సతీష్ ఆప్తలమిక్ అసిస్టెంట్, మెడికల్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

'ఉపాధి' కల్పించండి : వ్యకాసం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, సిఐటియు మండల నాయకులు రాజు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పనులు లేక రబీ సీజన్లో సాగు నీరు అందక మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో పనులు లేక ఇతర ప్రాంతాలకు ఆటోలలో వలస వెళ్లడం జరుగుతుందని తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదాలకు గురై కూలీలు మృతి చెందడం జరుగుతుందని తెలిపారు. సొంత గ్రామాల్లోనే పనులు ప్రారంభిస్తే ఉపాధి హామీ పనులకు వెళ్లి కూలీలు ఉపాధి పొందుతారని అన్నారు. ఏపీఓ వసుధ ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.



పిడికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్త పరుస్తున్న టిడిపి నాయకులు

దళితుల పట్ల జగన్ కపట ప్రేమ : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

దళితుల పట్ల సిఎం జగన్‌మోహన్ రెడ్డిది కపట ప్రేమ అని టిడిపి నాయకులు అన్నారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి ప్రభుత్వంలో దళితులపై జరుగున్న దమనకాండకు నిరసనగా, జగన్ కుట్రలకు బలైన ఐదేళ్లుగా జైలులో మగ్గిపోతున్న కోడి కత్తి శ్రీనుకు మద్దత్తుగా శుక్రవారం నాడు ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల రిబ్బన్లు చేపట్టి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి న్లతో నిరసన తెలిపారు. సీనియర్ నాయకులు కంచర్ల గోవింద రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నాయకులు, టిడిపి, జనసేన పార్టీ శ్రేణులు టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై నిత్యం అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి స్పందించడం లేదన్నారు. అధికార పార్టీకి చెందిన అగ్రవర్ణ నాయకులు దళితులను నిత్యం ఏదో ఒక రూపంలో వేధిస్తున్నప్పటికీ వారిపై చట్టపైన చర్యలు తీసుకోవడం లేదని నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయం గోవింద్ రెడ్డి, న్యాయ వాదులు రవికుమార్, కేశవరెడ్డి, టిడిపి అబ్దుల్లాపురం బాష, నాగరత్నం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్ట్ ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్

జర్నలిస్ట్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కర్నూలు ప్రభుత్వ వైద్యశాల యందు చికిత్స పొందుతున్న, నందికొ ట్కూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్టు (వార్త) గొల్ల రామాంజనేయులును నందికొట్కూరు శాసనసభ్యులు తొగురు ఆర్థర్ శుక్రవారం నాడు పరామర్శించి, ఆరోగ్య స్థితిగతుల గురించి వైద్యులతో చర్చించి, అవసరమైన చికిత్సను అందించాలని వైద్యులకు సూచించారు. అదేవిధంగా వార్డు యందు వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య చికిత్సల గురించి తెలుసుకుంటూ అవసరార్థులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు వైసీపీ నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, కొత్తపల్లి మండల నాయకులు దుద్యాల మహమ్మద్ రఫీ, గువ్వలకుంట్ల సహదేవుడు, విశ్రాంత పోలీస్ అధికారి వేల్పుల జయచంద్ర, దుద్యాల వార్డు మెంబర్ నూర్ అహమ్మద్, జూటూరు వెంకటరమణ, తాటిపాడు ఉస్మాన్ బాషా, ఎర్రగూడూరు మురహరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.


ప్యాపిలి నుంచి తరలి వెళ్లిన బిసి నాయకులు

స్వతంత్ర్య పోరాట రథయాత్రకు తరలిన ప్యాపిలి బిసి నేతలు

ప్రజాశక్తి - ప్యాపిలి

ఇచ్ఛాపురం నుండి తిరుపతి వరకు చేపట్టిన స్వతంత్ర్య పోరాట రథయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరింది. ఈమేరకు బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వై నాగేశ్వరరావు యాదవ్ పిలుపుమేరకు ప్యాపిలి మండలం నుంచి బీసీలు పెద్ద ఎత్తున కర్నూలుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎస్ నాగేశ్వ రావు, కోదండరామయ్య, వెంకట రంగయ్య, పాపయ్య, మహేష్, మహేంద్ర, మద్దిలేటి, కౌలుట్లయ్య,రాముడు, కంబగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో శాంతి టాకీస్ సమీపంలో 7వ వార్డు కౌన్సిలర్ షేక్ నాయబ్ ఆద్వర్యంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైఎస్ఆర్సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, జేసీఎస్ కన్వీనర్ అబ్బుబక్కర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబెర్ ఉస్మాన్ బేగ్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు చాంద్ బాషా, కృష్ణ, పట్టణ యూత్ అధ్యక్షుడు లడ్డు, వైసీపీ నాయకులు అబ్దుల్ జబ్బార్, ఆర్టీసీ బాబు, శాలి భాషా, బ్రహ్మయ్య ఆచారి, అంజి, సలాం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి : యుటిఎఫ్

5వ పేజీ తరువాయి.. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం నాడు ఆత్మకూరులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిలను చెల్లించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్మును ప్రభుత్వం దారి మళ్లించి సొంత ఖర్చులకు వాడుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలు ఉధృతంగా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమీర్ అహ్మద్, బాలాజీ రావు, సాయి ప్రసాద్,బొ జ్జయ్య,జాకీర్ హుస్సేన్,శ్రీనివాసులు, రమణ, రాముడు హరి, ఇమ్రాన్,అరిఫ్ తదితరులు పాల్గొన్నారు.


డోన్:తహసిల్దార్ కి వినతి పత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అభ్యుదయ వైతాళికుడు యోగి వేమన

ప్రజాశక్తి - నంద్యాల

మానవ జీవన సత్యాలను పద్య రూపంలో ప్రపంచానికి చాటిన అభ్యుదయ వైతాళికుడు యోగి వేమన అని మాతృ భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు డా. దీవి హయ గ్రీవా చార్యులు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో మాతృభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 'భారతి సీడ్స్' కార్యాలయంలో యోగి వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "యోగివేమన పద్యాలు - వ్యక్తిత్వ వికాసం" అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు డా. హయగ్రీవాచార్యులు అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు, కవులు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంత భావాన్ని ఆటవెలది పద్యాలలో పూరించి జనబాహుళ్యానికి అర్థం అయ్యేలా జీవన సత్యాలను వినిపించిన వేమనను నేటి కవులు ఆదర్శంగా తీసుకోవాలని హయగ్రీవాచార్యులు కోరారు. సదస్సుకు ముఖ్య అతిథిగా


వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

హాజరైన డా. రవీంద్రనాథ్ మాట్లాడుతూ పండిత పామరులను ఆబాల గోపాలాన్ని ప్రభా వితం చేసేలా సామాజిక జీవన వాస్తవాలను మంచి పద్యాల ద్వారా తెలుగు వారికి వేమన తెలియజేశారన్నారు. ప్రధాన వక్త డా. రమణమూర్తి వేమన పద్యాలు హృదయాంతరంగాల్లోకి సూటిగా బాణములా గుచ్చుకుపోతాయని అందుకే ప్రజల నాలుకలపై ప్రజాకవిగా వేమన గుర్తింపు పొందారన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సమాజంలో అశాస్త్రీయ భావజాలం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నదని వేమన ఇటువంటి వాటిని ముందుగానే పసిగట్టి తన పద్యాల ద్వారా ఆనాడే సూటిగా ప్రశ్నించా రన్నారు. మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో పాతుకుపోయిన అసాంఘిక మూఢత్వాన్ని నిట్టనిలువునా చీల్చి చెండాడిన కవి వేమన అని వేమన పద్యాలలోని హితోక్తులను జీవితానికి అన్వయించుకుంటే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుం దన్నారు. సదస్సులో రచయితలు మద్దిలేటి, ఎద్దు ప్రసాద్, రఫీ, డా.నీలం వెంకటేశ్వర్లు, డా.కిషోర్ కుమార్ వివిధ సంస్థల ప్రతినిధులు మాధవస్వామి, మురళీ కృష్ణారావు, తూము శివారెడ్డి, రామారెడ్డి, ఓబులపతి, రోటరీ విద్యా సంస్థల అధినేత డి.వి. సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన వేమన "పద్య పఠనం" కార్యక్రమంలో కవులు, ఉపాధ్యాయులు నీలకంఠమాచారి, మాబుబాష, కొప్పుల ప్రసాద్, నరేంద్ర, శేషఫణి వేమన పద్యాలను ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, విశ్రాంత శాస్త్రవేత్త డా. రవీంద్రనాథ్‌ను కవులు, రచయితలు ఘనంగా సత్కరించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

- జిల్లా ఎన్నికల అధికారి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - గడివేముల


అధికారులతో మాట్లాడుతున్న జెసి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు త్వరగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను అదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని బూజునూరు,పెసరవాయి,కరిమద్దెల గ్రామాల్లోని పోలింగ్ బూతులను వారు పరిశీలించారు. ఓటర్ల నుంచి వచ్చిన క్లైమ్స్‌ను త్వరగా విచారించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం అదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లోని సదుపాయాలపై నివేదికలు అందజేయాలని అధికా రులను కోరారు. బీఎల్ఓలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బూజునూరు గ్రామంలో గ్రామంలో లేని వారికి ఓట్లు ఎక్కించారని జిల్లా ఎన్నికల అధికారికి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు తెలిపారు. గతంలో దొంగ ఓట్ల కారణంగా మేము నష్టపోయామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి జిల్లా ఎన్నికల అధికారికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గ్రామంలో నివాసము ఉంటూ గుర్తింపు కార్డు ఉన్నవారికి గ్రామంలో ఓటు తప్పకుండా ఉంటుందని తెలిపారు. పెసరవాయి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకురాలు వడ్డు లక్ష్మీదేవి జిల్లా ఎన్నికల అధికారి నారపు రెడ్డి మౌర్యతో మాట్లాడుతూ తమది ఫ్యాక్షన్ గ్రామం కావడంతో మూడు పోలింగ్ బూత్లను ఒకే చోట పెట్టాలని కోరారు. పాఠశాల భవనాల పనులు జరుగుతున్నడం వలన ఎన్నికల సమయం లోపల పాఠశాల భవనాల పనులు పూర్తయితే ఒకే చోట పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు,డీటీ గురునాథ్,ఏఈ పవన్,వీఆర్వో హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఎంపిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా క్రికెట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన చాగలమర్రి-2వ సచివాలయ జట్టుకు రూ. 5 వేలు దాతలు వైసీపీ నాయకులు ఖాధర్‌బాష,పెయింటర్ షరీఫ్‌లు, ద్వితీయ స్థానంలో నిలిచిన చాగలమర్రి 4వ సచివాలయం జట్టుకు రూ.3 వేలను కాంట్రాక్టర్ హుసేన్‌వళి, వాలీ బాల్ విజేత విన్నర్స్ ముత్యాలపాడు జట్టుకు రూ.3 వేలను,రన్నర్స్‌గా నిలిచిన చాగలమర్రి 2వ సచివాలయ జట్టుకు రూ.2 వేలను ఎంపిపి వీరభద్రుడు, కబడ్డీలో విజేతలైన శెట్టివీడు జట్టుకు రూ.3 వేలు, రన్నర్స్‌గా నిలిచిన పెద్దబోదనం జట్టుకు రూ.2 వేలను వైసీపీ నాయకులు బొంతల రంగయ్య,ఖోఖో పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన శెట్టివీడుకు రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన చాగలమర్రి 5వ సచివాలయ జట్టుకు రూ.2 వేలను వైసీపీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన చిన్నవంగలికి రూ.2 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పెద్దబోదనం జట్టుకు రూ.1500, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన చాగలమర్రి 2వ సచివా లయ జట్టుకు 3 వేలు,ద్వితీయ స్థానంలో నిలిచిన చాగలమర్రి - 3 జట్టుకు రూ.1500, మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన చాగలమర్రి 5వ సచివాలయ జట్టుకు రూ.2 వేలను, ద్వితీయ స్థానంలో నిలిచిన మద్దూరు సచివాలయ జట్టుకు రూ.వెయ్యి రూపాయలను చక్రం బీడి షబ్బీర్ అందజేసారు. అనంతరం


బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ వీరభద్రుడు

క్రీడలను విజయవంతంగా నిర్వహించెందుకు కృషి చేసిన అధికారులను, దాతలను,పిఈటి లను ఎంపీడీఓ మహబూబ్ దౌలా ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణయ్య, జేసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్,ఉపసర్పంచ్ సోహెల్, విద్యాకమిటి చైర్మన్ అబ్దుల్లా,పిడిలు దాదాపీర్, ఆశాజ్యోతి, సుమన్, శ్రీనాథరెడ్డి, శ్రీనివాసులు, అలివేలు, వెంకటేష్,కిరణ్,భారతి,పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేత చౌడయ్య కుమారుడు మృతి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండల మాజీ వైసీపీ కన్వీనర్ పి చౌడయ్య చిన్న కుమారుడు రాజు (31) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో చౌడయ్య కుటుంబంలో విషాదం అలుముకుంది. రాజుకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, పాముల పాడు మండల వైసిపి అధ్యక్షులు జి. రామలింగేశ్వర్ రెడ్డి, మాజీ సింగల్ విండో సొసైటీ అధ్యక్షులు ఏ హరి సర్వోత్తమరావు, పాములపాడు మాజీ సర్పంచ్ ఏ విజయ సింహారెడ్డి, వైసీపీ మండల కార్యదర్శి మధుసూదన్ రావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, మండల నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, మధుకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు రాజు మృతదేహానికి నివాళులర్పించి చౌడయ్యను ఓదార్చి కుటుంబానికి సానుభూతి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు టిఎన్ఆర్ నాగరాజు, రుద్రవరం సర్పంచ్ రామస్వామి, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, మిటకందల సర్పంచ్ చింతల నారాయణ, నాయకులు రమణారెడ్డి, మహానంది రెడ్డి, జబ్బర్, బాలీశ్వర్ రెడ్డి, ఉపేంద్ర, ప్రభాకర్, రాజన్న, మాలిక్ భాషా, బాలు నాయక్, పుల్లయ్య, హుస్సేన్, రాములమ్మ, రాజశేఖర్, టిడిపి నాయకులు ఎన్ కృష్ణయ్య, వివేకానంద విద్యా విహార్ కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్, పలువురు నాయకులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


నివాళులర్పిస్తున్న వైసీపీ మండల అధ్యక్షులు జి.రామలింగేశ్వర్ రెడ్డి, పలువురు నాయకులు సర్పంచులు

ప్రయాణికులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-డోన్

జనవరి 1వ తేదీ నుండి జనవరి 15 వరకు డోన్ నుండి కర్నూల్‌కు పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు బహుమతులు అందించినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశి భూషణ్ తెలిపారు. శుక్రవారం డోన్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రయాణికుల సమక్షంలో గిఫ్ట్ స్కీము విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ మాట్లాడుతూ పల్లె వెలుగు బస్సుల యందు ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్ నందు ప్రయాణికులు తమ టికెట్ వెనకాల వారి పేరు, ఫోన్ నెంబరు రాసి గిఫ్ట్ బాక్స్ నందు వేసినార ని వారికి సంబంధించి శుక్రవారం డ్రా తీశామన్నారు. ఎంపికైన ముగ్గురు ప్రయాణికులు మొదటి బహుమతి డోన్ పాతపేటకు చెందిన యం.శ్రీదేవి,రెండవ బహుమతి డోన్ పాతపేటకు చెందిన యం.వెంకటేశ్వ రులు, మూడవ బహుమతి కర్నూల్‌కు చెందిన కే.హనుమంతులుకు ప్రయాణికుల సమక్షంలో బహుమతులు అందజేయడం జరిగిందన్నారు.


ప్రయాణికులకు బహుమతులను అందిస్తున్న డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం శశిభూషణ్

ఓటర్ల తుది జాబితా ప్రచురణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

5వ పేజీ తరువాయి.. సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఫారం - 7 ద్వారా అందిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ చేసి తప్పులు లేని ఓటర్ల తుది జాబితా రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాబోయే సాధారణ ఎన్నికల పటిష్ట నిర్వహణకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ నియమ నిబంధనలపై శిక్షణ నిచ్చేందుకు జిల్లా ఎన్నికల అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఈనెల 22 వ తేదీ పారదర్శక, నిష్పక్షపాత ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈఆర్వోలను ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, టాయిలెట్స్ తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నియోజకవర్గాలలో ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకొని పనులు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, ఎం దాసు, వెంకటరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడండి

5వ పేజీ తరువాయి.. వెలుగోడు : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు తహసిల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్, అంగన్వాడి సెక్టార్ నాయకురాలు భాగ్యలక్ష్మి, తులసమ్మ, సావిత్రమ్మ, కుమారి, శోభారాణి, రవణమ్మ అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు. **మహానంది :** తహసిల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీల దీక్షా శిబిరం వద్దకు సిఐటియు నాయకులు ఏసురత్నం, నాగరాజు చేరుకుని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయంలో వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాల కృష్ణ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ సీనియర్ నాయకులు శైలజ, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, శ్రీలక్ష్మి, హరిత, కీర్తి తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. నాయకురాలు పద్మావతి, త్రివేణి, రేణుక, లీలావతి, శ్రీదేవి, ప్రభావతి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రోజురోజుకీ సమ్మె ఉధృతం అవుతోందన్నారు. **పాములపాడు:** మండల కేంద్రంలో అంగన్వాడీలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అంబేద్కర్ మార్గంలో సమ్మె నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటికైనా మా సమస్యల పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, రవణమ్మ బాయ్, శ్రీలత, నాగమణి, టీచర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

అంగన్వాడిల డిమాండ్స్ పట్ల నిర్లక్ష్య ధోరణి తగదు

- విఓఎల సంఘం మండల కార్యదర్శి ఎన్వి రమణ

బేతంచెర్ల : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం సరైంది కాదని వివోఏల సంఘం మండల కార్యదర్శి ఎన్వి రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వైబి వెంకటేశ్వర్లు అన్నారు. బేతంచెర్ల మండలంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. విఓఎల సంఘం నాయకులు బాలరాజు, రామనాథం, రహమతుల్లా, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** అంగన్వాడీలు అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రాన్ని ఇచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సిఐటియు ఆళ్లగడ్డ పట్టణ కార్యదర్శి రమేష్ బాబు లతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం ముందు ఉన్న టెంటు శిబిరంలో అంబేద్కర్ పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సిఐటియు ఆళ్లగడ్డ ప్రాజెక్టు నాయకురాలు లక్ష్మీ సుధామణి, పెద్దక్క, నరసమ్మ, భారతి, శాంతమ్మ, శశికళ, బానుమతి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు అంబేద్కర్ చిత్రపటానికి అంగన్వాడీలు పూలమాలలు వేసి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణిలు మాట్లాడారు.

అంగన్‌వాడీల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

నందికొట్కూరు టౌన్ : జుపాడు బంగ్లా మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల నాయకులు కర్ణ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు శ్రీనివాసులు, బాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగ లింగేశ్వరం, రవి, సిపిఎం మండల నాయకులు శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు గోపాలకృష్ణ, నరసింహ, రాము, రైతు సంఘం నాయకులు ఏసన్న, రామిరెడ్డి, కెవిపిఎస్ జిల్లా నాయకులు రంగమ్మ, లింగస్వామి, జయరాణి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలు గత 39 రోజుల నుంచి తమ సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులకు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారని వారి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయకపోవడంతో గత్యంతరం లేక సమ్మె చేయాల్సివచ్చిందని అన్నారు. క్రిస్టమస్, జనవరి, సంక్రాంతి పండగలు కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో కలిసి చేసుకోవాల్సిన మహిళలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్లపాలు చేసిందని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా అంగన్వాడీల న్యాయమైన కోరికలు తక్షణమే పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి అవసరమైతే రాష్ట్ర బంద్‌కు వెనకాడబోమని వారు హెచ్చరించారు. అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరు టౌన్ : మాట్లాడుతున్న సిపిఎం నాయకులు


ఆత్మకూరు : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు


బండి ఆత్మకూరు : అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు


పగిడ్యాలలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు


కొత్తపల్లి: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు


పాములపాడులో


బేతంచెర్ల : మాట్లాడుతున్న నాయకులు